లింగబసవేశ్వర బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, ఫిబ్రవరి 24 : మండలంలోని పడమటిసోమారం గ్రామంలో లింగబసవేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవాలపై ఉత్సవ కమిటీ చైర్మన్ సందిగారి బసవయ్య ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో శనివారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 4నుంచి జరుగనున్న బ్రహ్మోత్సవాలకు ఇతర రాష్ట్రాల నుంచి గిరిజన భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, వారికి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. సమావేశంలో ఆర్డీఓ అమరేందర్, అడిషనల్ డీసీపీ, దేవాదాయ శాఖ అధికారి నరేందర్ రెడ్డి, ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, ఆలయ ధర్మకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజినీర్లతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు, పీఎం విశ్వకర్మ యోజన దరఖాస్తులు, తాగునీటిపై మండలాల వారీగా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో కూలీల శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, గ్రామ అవసరాలకు తగిన పనులు గుర్తించాలని, పీఎం విశ్వకర్మ యోజన పథకానికి అర్హులందరూ దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. బల్క్ వాటర్, ఫిర్యాదులు, క్లోరినేషన్, ఓహెచ్‌ఆర్, క్లీనింగ్, రిపేర్లు, బ్లీచింగ్ పౌడర్, స్టాక్ రిజిస్టర్ సంబంధించి ఏడు రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

మున్సిపల్, గ్రామ పంచాయతీల్లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, బోర్‌వెల్స్, హ్యాండ్ పంపులను పరిశీలించి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు. మండల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ కృష్ణన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ కరుణాకరణ్ పాల్గొన్నారు.

బీసీలకు తొమ్మిది పార్లమెంట్ స్థానాలు కేటాయించాలి

- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 24 : రాష్ట్రంలో కనీసం 9 పార్లమెంట్ స్థానాల్లో బీసీలకు టికెట్లు ఇవ్వాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలను మోసం చేశాయని, డబ్బు మూటలతో ఓట్లను కొనుగోలు చేసిన నాయకులకే టికెట్లు ఇచ్చాయని అన్నారు. బీసీలకు పథకాలు, రాయితీలు కాదని, రాజకీయంగా వాటా కావాలని డిమాండ్ చేశారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఆయా పార్టీలు బీసీలకు టికెట్లు కేటాయిస్తూ ప్రకటన చేయాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా రెడ్డి రాజ్యంగా మారిందన్నారు. బీసీలు అత్యధికంగా ఉన్న భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని బీసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు.

బీసీ కులగణన చేయాలని గతంలో తాము ఎన్నో పోరాటాలు చేశామని, ఆ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కులగణనకు ప్రతిపక్ష పార్టీలు సహకరించాలని కోరారు.

మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో ఎల్లంబావి విద్యార్థుల ప్రతిభ

మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన ప్రగతి ఉన్నత పాఠశాల విద్యార్థులు

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 24 : ఎస్ ఓఎఫ్ సంస్థ ఇటీవల నిర్వహించిన మ్యాథ మెటిక్స్ ఒలింపియాడ్‌లో ఎల్లంబావి గ్రామంలోని ప్రగతి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్‌డీ సయ్యద్ తెలిపారు. ఒలింపియాడ్‌లో గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలు సాధించిన విద్యార్థులను శనివారం ఆయన అభినందించారు. గణిత పరీక్షలో పాఠశాల నుంచి 22మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు.

సిలిండర్ లీకై మంటలు

మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆలేరు, ఫిబ్రవరి 24 : పట్టణంలో ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు అంటుకుని హోటల్ స్వల్పంగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పెద్దవాగు సమీపంలోని పరివార్ బిర్యానీ హౌజ్‌లో శనివారం సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గమనించిన హోటల్ నిర్వాహకులు ఫైరింజిన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే హోటల్‌లోని వస్తువులు కాలిపోయాయని, ప్రాణ నష్టం సంభవించలేదని హోటల్ నిర్వాహకులు తెలిపారు.

యాదగిరీశుడికి వైభవంగా దర్బార్ సేవ

స్వామి, అమ్మవార్లకు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 24 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దర్బార్ సేవోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి సేవోత్సవాన్ని నిర్వహించారు. నాలుగు వేదాలు స్వామివారికి పారాయణం చేసి, స్వస్తిమంత్రార్థ వంటి మంత్రాలతో శాంతింపజేశారు. నక్షత్ర హారతి ఇచ్చి స్వామి వారిని కొలిచారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో కల్యాణోత్సవ సేవను ఊరేగించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్య కల్యాణ తంతును నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం వేళ స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి వేళ స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

ఆలయ మాఢవీధులు, క్యూ కాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, పార్కింగ్ ప్రాంతాలు భక్తులతో సందడిగా మారాయి. సుమారు 23వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.30,63,104 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.రామకృష్ణారావు తెలిపారు.

బుజిలాపురంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

బుజిలాపురంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న పురోహితులు

మోత్కూరు, ఫిబ్రవరి 24 : మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గుట్టపై కొలువుదీరిన లక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారిని పెళ్లి కొడుకుగా, పార్వతీ దేవిని పెళ్లి కూతురుగా ముస్తాబు చేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో కనుల పండువగా కల్యాణ తంతు జరిపించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం స్వామివారిని పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ దాత ఎగమాటి రాంరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ ఎం.రజిత, మాజీ సర్పంచులు చేతరాశి వీరస్వామి, అంజయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిభావంతోనే మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే సామేల్

భక్తిభావంతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుజిలాపురంలో లక్ష్మీనర్సింహ, వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు.

వైభవంగా మహమ్మాయిదేవి, పరమేశ్వరుల కల్యాణం

మహమ్మాయిదేవి, పరమేశ్వరుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 24 : పట్టణంలోని మహమ్మాయిదేవి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయం ఆవరణలో మహమ్మాయి దేవి, పరమేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి పూజారులు శాస్త్రోక్తంగా కనుల పండువగా కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయంలో మహా అన్నదానం, నైవేద్య నివేదన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చేపూరి రామ్మోహనాచారి, ఉత్సవ కమిటీ సభ్యులు కృష్ణమాచారి, రాఘవేంద్రాచారి, స్వామి, ఆనంద్, ప్రభాకర్, రామకృష్ణ, రవిచారి, మహేశ్, పూజారి మల్లేశ్ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ఘనంగా బోనాలు

బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలో పునర్నిర్మాణం చేపట్టిన కనకదుర్గ ఆలయ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా బోనాలను తీసుకెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు ఏనుగు సుగంధిని, సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ యాస కవిత, మాజీ ఎంపీపీ ప్రతి కంఠం హేమలత, రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గుండెగాని ఐలయ్య గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

కల్యాణంలో తాళిబొట్టు చూపుతున్న పూజారి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : పట్టణ పరిధి రాయగిరిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, కౌన్సిలర్ నాయిని అరుణ, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంగనాయకస్వామి ఊరేగింపు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 24 : మండలంలోని పెద్ద రావులపల్లి గ్రామంలో భూనీలా సమేత రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ జడల అంజయ్య, ఎంపీటీసీ చిలుక బుచ్చయ్య, మాజీ సర్పంచ్ మట్ట బాలమణి, అర్చకులు రామాచార్యులు, ప్రతినిధులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు లక్ష విరాళం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 24 : పట్టణంలో హిందూవాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శివాజీ విగ్రహ నిర్మాణానికి పట్టణానికి చెందిన సోలిపురం శ్రీకాంత్ రెడ్డి లక్ష రూపాయల ఇచ్చారు. ఈ సందర్భంగా హిందూవాహిని నాయకుడు ఆనంద్‌కు శనివారం చెక్కు అందజేశారు. శివాజీ విగ్రహ ఏర్పాటుకు దాతలు ముందుకు రావాడం సంతోషకరమన్నారు.

3 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వలిగొండ, ఫిబ్రవరి 24 : మండలంలోని గోకారం గ్రామ పరిధిలో మూసీ నది నుంచి రాత్రి వేళ ఇసుకను తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ చేసిన సుమారు 30 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. ఇసుకను తరలిస్తున్న 3 ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

అజీంపేటలో ఒక ట్రాక్టర్..

అడ్డగూడూరు, ఫిబ్రవరి 24 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మండలంలోని అజీంపేట గ్రామానికి చెందిన లింగాల కుమారస్వామి గ్రామ పరిధిలోని మూసీ వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎస్ఓటీ పోలీసులు

వలిగొండ, ఫిబ్రవరి 24 : మండలంలోని నాగారం గ్రామ పరిధిలో ధనలక్ష్మి రైస్ మిల్లుపై శుక్రవారం రాత్రి భువనగిరి ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజాపేట, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1969-70 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఎంఈఓ బల్ల దామోదర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించే సమ్మేళానికి పూర్వ విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

హాలియా సమీపంలోని వజ్రతేజ రైస్‌మిల్లులో సినిమా షూటింగ్‌లో పాల్గొన్న నటుడు వెన్నెల కిశోర్

హాలియాలో విశ్వంభర

- రైస్‌మిల్లులో చిరంజీవిపై సన్నివేశాల చిత్రీకరణ
- మెగాస్టార్‌ను చూసేందుకు తరలివచ్చిన అభిమానులు

హాలియా, ఫిబ్రవరి 24 : హాలియా పరిధిలోని వజ్రతేజ రైస్‌మిల్లులో శనివారం విశ్వంభర సినిమా షూటింగ్ జరిగింది. సినిమాలో హీరోగా నటిస్తున్న చిరంజీవి షూటింగ్‌లో పాల్గొన్నారు. చిరంజీవి రైస్‌మిల్లు ఓనర్‌గా నటించే సన్నివేశాలను చిత్రీకరించారు. షూటింగ్‌లో వెన్నెల కిశోర్, చమ్మక్‌చంద్ర, రాజా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. చిరంజీవి షూటింగ్‌కు వస్తున్న విషయం తెలుసుకున్న అభిమానులు, చుట్టుపక్కల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. షూటింగ్‌కు ఆటంకం కలుగకుండా హాలియా సీఐ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

బూత్ లెవల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆలేరు, ఫిబ్రవరి 24 : క్షేత్రస్థాయి పరిశీలన చేసి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి బూత్ లెవల్ అధికారులకు సూచించారు. స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో శనివారం బూత్ లెవల్ అధికారులతో సమావేశమై ఫామ్ 6, 7, 8 దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని, 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తాసీల్దార్ వెంకట్‌రెడ్డి, బూత్ లెవల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం యథావిధిగా చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీశైలంగౌడ్

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 24 : చౌటుప్పల్ నుంచి భువనగిరికి వెళ్లే రహదారిని గతంలో తీర్మానించిన విధంగా పట్టణంలో హైస్కూల్ వరకు 21ఫీట్ల రోడ్డు నిర్మించాలని సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలంగౌడ్ కోరారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన రోడ్డు విస్తరణ బాధితుల సమావేశంలో వారు మాట్లాడారు. రామాలయం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు పాత గ్రామంలో ఈ రోడ్డు వెంట చాలా మంది నిరుపేదలు ఉన్నారన్నారు. వారికి ఉన్న చిన్నపాటి ఇండ్లను కూల్చకుండా అందరికీ ప్రయోజనం జరిగేలా గతంలో మున్సిపల్‌లో తీర్మానించిన విధంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు పోలోజు శ్రీధర్‌బాబు, దండ హిమబింధు, బొడిగె అరుణ, నాయకులు ఎండీ ఖయ్యూం, బొబ్బిళ్ల శ్రీరాములు, వరగంటి మహేందర్, గడ్డం రఘుపతి, అశోక్, తిరుమల్‌రెడ్డి, రాజు, రోడ్డు విస్తరణ బాధితులు పాల్గొన్నారు.

కూనూరులో దంత వైద్య శిబిరం

కూనూరులో దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : మండలంలోని కూనూరు గ్రామంలో సంధ్య డెంటల్ క్లినిక్, ఎంపీటీసీ పాశం శివానంద్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌రెడ్డి పర్యవేక్షణలో 200 మందికి పైగా పరీక్షించి దంత సమస్యలకు సూచనలు చేసి మందులు అందజేశారు. ప్రజలకు బ్రష్, టూత్‌పేస్ట్ ఉచితంగా అందజేశారు.

కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్, ఎస్ఐ శివనాగప్రసాద్, కర్తాల శ్రీనివాస్, సుధాకర్, శ్రీనివాస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను సందర్శించిన మహిళా సంక్షేమాధికారి

అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా మహిళా సంక్షేమాధికారి కృష్ణవేణి

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 24 : మున్సిపాలిటీ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా మహిళా సంక్షేమాధికారి కృష్ణవేణి శనివారం సందర్శించారు. పట్టణంలోని ఒకటి, ఎనమిది, పన్నెండు వార్డుల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో రికార్డులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ శోభ, టీచర్లు సబియా, మల్లమ్మ, నిర్మల ఉన్నారు.